క్లుప్తంగా

అప్రమత్తత అవసరం

తిరుమలాయపాలెం: సమాజంలో పెరుగుతున్న సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని ఎస్సై కూచిపూడి జగదీష్ అన్నారు. స్థానిక పోలీస్ శాఖ ఆధ్వర్యాన సోమవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సైబర్ నేరాలపై 1930, పోలీసులు సాయం కోసం డయల్ 100పై అవగాహన కలిగి ఉండాలన్నారు. రుణమాఫీ, కరెంట్ బిల్లులు, కేవైసీ అప్డేట్ తదితర వాటిపై వచ్చే కాల్స్‌కు స్పందించవద్దని, తెలియని లింకులు ఓపెన్ చేయొద్దన్నారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుళ్లు కిషన్, సౌజన్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయాలి

ఖమ్మంఅర్బన్: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీ ఖానాపురం హవేలీ కార్యదర్శి సుంకర బుజ్జయ్య పేర్కొన్నారు. సోమవారం ఖానాపురంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని, తాగునీటి సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు దంతాల నారాయణ, జ్యోతి, అరుణ, రమేష్, వెంకన్న, నరేష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డుకు శంకుస్థాపన

తిరుమలాయపాలెం: మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌ను మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ దయాకర్‌రెడ్డి సోమవారం ప్రారంభించారు. అనంతరం సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. పలువురు నూతన వధువరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఆత్మా పాలేరు డివిజన్ కమిటీ చైర్మన్ చావా శివరామకృష్ణ, మాజీ ఎంపీపీ కొప్పుల అశోక్, లింగయ్య, వెంకటేశ్వర్లు, మాచర్ల నాగరాజు, హరినాథ్, తోట వెంకట్, వాసు పాల్గొన్నారు.

పోలీస్ సిబ్బందికి వైద్య పరీక్షలు

ఖమ్మంక్రైం: పోలీస్ సిబ్బంది సంక్షేమ కార్యక్రమంలో భాగంగా సోమవారం నాగుబండి మల్టీ స్పెషాలిటీ డెంటల్ ఆస్పత్రి ఆధ్వర్యాన ఉచిత డెంటల్ వైద్య పరీక్షలు నిర్వహించారు. సీపీ సునీల్‌దత్ ఆదేశాల మేరకు పోలీస్ హెడ్ క్వార్టర్స్ పరేడ్ గ్రౌండ్స్‌లో ఏర్పాటు చేసిన శిబిరంలో డాక్టర్ ప్రత్యూష పోలీస్ సిబ్బందికి పరీక్షలు నిర్వహించారు. పోలీస్ సిబ్బంది శ్రేయస్సు కోసమే ఈ శిబిరం ఏర్పాటు చేసినట్లు ఏఆర్ ఏసీపీ నర్సయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ అప్పలనాయుడు పాల్గొన్నారు.

కృషి, పట్టుదలతో విజయం సాధ్యం

ఖమ్మం సహకారనగర్: విద్యార్థులు కృషి, పట్టుదలతో చదువుకుంటే విజయం సాధ్యమవుతుందని వ్యక్తిత్వ వికాస నిపుణుడు అట్లూరి వెంకటరమణ అన్నారు. సోమవారం నగరంలోని రాజేంద్రనగర్ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు నిర్వహించిన వ్యక్తిత్వ వికాస సదస్సులో ఆయన మాట్లాడారు. చదువుతోనే అద్భుతాలు సాధ్యపడతాయన్నారు. అనంతరం వెంకటరమణను సన్మానించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం గాయత్రి, ఉపాధ్యాయులు సత్యనారాయణ, శ్రీనివాసాచారి, పురుషోత్తం, పుల్లయ్య, రవికుమార్, లాలయ్య పాల్గొన్నారు.

ఎస్ఈని కలిసిన 1104 యూనియన్ ప్రతినిధులు

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం ఎన్పీడీసీఎల్ సర్కిల్ ఎస్ఈగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన శ్రీనివాసాచారిని 1104 యూనియన్ ప్రతినిధులు సోమవారం మర్యాద పూర్వకంగా కలిసి మొక్క అందించారు. ఈ కార్యక్రమంలో డిస్కం యూనియన్ ప్రతినిధి టి.శేషగిరిరావు, జిల్లా అధ్యక్షులు ఎంవీ రమణారెడ్డి, జీఎల్ఎస్ రావు, సీతారామయ్య, సురేష్, శ్రీనివాస్, వెంకటేశ్వరరావు, కిరీటాచారి, స్రవంతి, రమ, సలీమ్ పాషా, నర్సింహారావు పాల్గొన్నారు.

ఎక్సైజ్ కానిస్టేబుళ్లకు ప్రశంసలు

నేలకొండపల్లి: స్థానిక ఎక్సైజ్ సర్కిల్‌లో పి.శ్రీనివాసరావు (హెడ్ కానిస్టేబుల్), కానిస్టేబుళ్లు జె.రామారావు, ఎం.లాలు, వి.వెంకటేశ్వర్లు, ఎస్.బలరాం, డి.సునీతలు గంజాయి నిర్మూలనకు విశేషంగా కృషి చేశారు. ఈ మేరకు సోమవారం హైదరాబాద్‌లోని ఎక్సైజ్ భవన్‌లో వీరికి ప్రశంసాపత్రంతో పాటు నగదును ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కమలాహాసన్ చేతుల మీదుగా అందుకున్నారు.

ప్రభుత్వ భూమిలో మట్టి తవ్వితే చర్యలు

నేలకొండపల్లి: అనుమతులు లేకుండా ప్రభుత్వ భూమిలో మట్టి తవ్వితే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ జె.మానిక్‌రావ్ హెచ్చరించారు. కట్టుకాచారం గుట్టల నుంచి మట్టి తరలింపుపై వస్తున్న ఫిర్యాదుల నేపథ్యాన సోమవారం గుట్టను సందర్శించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. గుట్ట సమీపంలో జేసీబీలు, ట్రాక్టర్లు కనిపిస్తే సీజ్ చేస్తామని హెచ్చరించారు. మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఆలస్యం మధుసూదన్‌రావు పాల్గొన్నారు.

రైతుబజార్ రెడీ..


ఖమ్మం పెవిలియన్ గ్రౌండ్ వద్ద ప్రారంభానికి సిద్ధంగా ఉన్న రైతుబజార్

రైతులకు అన్ని సౌకర్యాలతో ప్రారంభానికి సిద్ధం
- త్వరలోనే తెరుచుకునే అవకాశం
- ఇన్నాళ్లు ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఆటంకం
- విక్రయాలకు 120 మంది రైతుల దరఖాస్తు

ఖమ్మంవ్యవసాయం: నగరంలోని పెవిలియన్ గ్రౌండ్ పక్కన ఉన్న పూర్వపు రైతుబజార్ ప్రస్తుతం పునర్నిర్మాణం చేయబడి తిరిగి క్రయ విక్రయాలు నిర్వహించేందుకు సిద్ధంగా ఉంది. గత ప్రభుత్వ హయాంలో రైతుబజార్‌లను మూసివేయించి రైతుల సౌకర్యార్థం సమీకృత మార్కెట్లను ఏర్పాటు చేసింది. కరోనా కాలంలో (2020 మార్చి 10న) ఇక్కడి రైతుబజార్‌ను మూసివేశాక అందులోని నిర్మాణాలనూ తొలగించారు. అయితే నగరంలోని నూతన బస్టాండ్ పక్కన, వీడీవోస్ కాలనీల్లో ఏర్పాటు చేసిన సమీకృత మార్కెట్లు అంతగా ఫలితాన్ని ఇవ్వకపోవడంతో రైతులు నగరంలోని పలు కూడళ్లలో తాము పండించిన కూరగాయలు, ఆకుకూరలను విక్రయించుకుంటున్నారు.

రైతుల అభ్యర్థన మేరకు..
కొందరు రైతులు పూర్వపు రైతుబజార్‌ను తిరిగి నిర్మించి తమకు అప్పగించాలని కోరుతూ రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావును అభ్యర్థించారు. దీంతో మంత్రి తుమ్మల జిల్లా కలెక్టర్, మార్కెటింగ్ శాఖ, ఉద్యాన శాఖల జిల్లా అధికారులను రైతుల అభ్యర్థనను పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మార్కెటింగ్ శాఖ పర్యవేక్షణలో పూర్వపు స్థితిలోనే నూతన నిర్మాణాలు చేశారు. ముఖ్యంగా రైతుబజార్ కార్యాలయం, కూరగాయల విక్రయాల షెడ్లు, రైతులు, వినియోగదారులకు సౌకర్యవంతంగా టాయిలెట్లు, మంచినీరు వంటి సౌకర్యాలను ఏర్పాటు చేశారు.

120 దరఖాస్తులు..
రైతుబజార్‌లో తాము పండించిన పంటల విక్రయాలకు అనుమతించాలని రఘునాథపాలెం, ఖమ్మం అర్బన్ మండలాల పరిధిలోని పలు గ్రామాలకు చెందిన 120 మంది రైతులు దరఖాస్తులు చేసుకున్నారు. ఇదివరకు ఇక్కడ కూరగాయలు, ఆకుకూరలు విక్రయించిన వారే దరఖాస్తు చేసుకోగా.. ఈ దరఖాస్తులను జిల్లా ఉద్యాన శాఖ పరిశీలించి అనుమతులు కల్పిస్తూ మార్కెటింగ్ శాఖకు సిఫారసు చేసింది. మార్కెటింగ్ శాఖ ఉద్యాన శాఖ నిర్ణయించిన రైతులకు కార్డులు జారీ చేసి అనుమతులు ఇవ్వాల్సి ఉంది.

త్వరలోనే కార్డులు..
ఇన్నాళ్లు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ రైతుబజార్ ప్రారంభానికి ఆటంకం ఏర్పరిచింది. అయితే ఆ ఎన్నికల కోడ్ ఈనెల 2తో ముగియడంతో త్వరలోనే దీన్ని ప్రారంభించే అవకాశం ఉందని ప్రభుత్వ శాఖలు, రైతులు భావిస్తున్నారు. అర్హత కలిగిన రైతులకు కార్డులు కేటాయించి పండించిన కూరగాయ పంటలను రైతుబజార్‌లో విక్రయించే విధంగా అనుమతించే చర్యలు తీసుకోనున్నారు. ఈ రైతుబజార్‌లో స్థానం కోసం ఖమ్మం నగర పరిసర ప్రాంతాల రైతులు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు.

రైతులను గుర్తించాం..



రైతుబజార్‌లో కూరగాయలు, ఆకుకూరలు విక్రయించేందుకు రైతులు చేసుకున్న దరఖాస్తులను పరిశీలించాం. ఇందులో ఖమ్మం అర్బన్, రఘునాథపాలెం మండలాల పరిధిలోని పలువురు రైతులు దరఖాస్తు చేసుకున్నారు. వాటిని పరిశీలించి అనుమతులిస్తూ మార్కెటింగ్ శాఖకు సిఫారసు చేశాం.
– ఎం.వీ.మధుసూదన్, జిల్లా ఉద్యానాధికారి

పన్ను చెల్లించకుంటే రెడ్ నోటీసు..


సిబ్బందికి సూచనలు చేస్తున్న కమిషనర్ అభిషేక్ అగస్త్య

ఖమ్మంమయూరిసెంటర్: పన్నులు చెల్లించకుండా బకాయి పడిన వారికి తక్షణమే రెడ్ నోటీసులు జారీ చేయాలని కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య అధికారులను ఆదేశించారు. సోమవారం నగరంలోని పన్నుల వసూళ్ల కేంద్రాలను కమిషనర్ పరిశీలించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. బకాయిదారులకు రెడ్ నోటీసు ఇచ్చిన తర్వాత కూడా పన్నులు చెల్లించకుంటే నోటీసు గడువు ముగిసిన వెంటనే సంబంధిత భవనాలను సీజ్ చేయాలని ఆదేశించారు. నగరంలో ఎంత మంది పన్ను బకాయిదారులు ఉన్నారో గుర్తించాలని, ఇప్పటి వరకు సీజ్ చేసిన భవనాలు ఏమైనా ఉన్నాయా అని ఆర్ఐ, బిల్ కలెక్టర్లను అడిగి తెలుసుకున్నారు. పెద్ద మొత్తంలో పన్నులు చెల్లించాల్సిన వారిని కలిసి బకాయిల వివరాలను తెలపాలని, నూరుశాతం ఇంటి, పంపు పన్నులు వసూలు అయ్యేలా ప్రణాళిక ప్రకారం పని చేయాలన్నారు. ఈ నెలాఖరు కల్లా బిల్ కలెక్టర్లకు విధించిన పన్నుల వసూళ్ల లక్ష్యాలను అధిగమించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఓ జి.శ్రీనివాసరావు, ఆర్ఐ, బిల్‌కలెక్టర్లు పాల్గొన్నారు.

☞ డివిజన్ సమస్యలపై వినతి
ఖమ్మంఅర్బన్: నగరంలోని ఒకటవ డివిజన్ కైకొండాయిగూడెంలో రోడ్ల సమస్య తీర్చాలని కోరుతూ సోమవారం కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్యకు సీపీఎం(ఎంఎల్) మాస్‌లైన్ గ్రామ కమిటీ ఆధ్వర్యాన వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా జిల్లా నాయకుడు కె.శ్రీనివాస్ మాట్లాడుతూ.. విద్యానగర్ కాలనీ, రైల్వే కాలనీలో సీసీ రోడ్లు, డ్రెయినేజీ లేకపోవడంతో చిన్న చినుకు పడ్డా మొత్తం బురదమయమై నడవలేని పరిస్థితి ఉందన్నారు. ప్రతీ ఏడాది క్రమం తప్పకుండా ఇంటి పన్ను, నీళ్ల పన్ను చెల్లిస్తున్నామని, అయినా మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే సీసీ రోడ్లు, డ్రెయినేజీ నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకురాలు సీహెచ్.శిరోమణి, పార్టీ డివిజన్ నాయకులు ఇమ్మడి వెంకటేశ్వర్లు, భరత్, జె.లెనిన్, బొమ్మకంటి రమేష్, ధరణ్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.


కేఎంసీ సమాచారం

☞ పోటీ పరీక్షలకు పుస్తకాల వితరణ..
ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని గాంధీ లైబ్రరీలో ఉద్యోగాల సాధనకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులకు అవసరమైన పుస్తకాలను ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యాన సోమవారం ట్రెయినీ, అసిస్టెంట్ కలెక్టర్ మ్రినాల్ శ్రేష్ఠ గ్రంథాలయానికి అందజేశారు. వార్డు ఆఫీసర్ బెందు వీరబాబు, అభ్యర్థులు ఉన్నారు.

☞ ఫ్లెక్సీలు, హోర్డింగ్‌ల తొలగింపు..
నగరంలోని ఇల్లెందు రోడ్డు, వైరా రోడ్డు, పాత మున్సిపల్ ఆఫీస్ రోడ్డు, తదితర ప్రాంతాల్లో రోడ్ల వెంట, డివైడర్ల మధ్య ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లను కేఎంసీ డీఆర్ఎఫ్ సిబ్బంది తొలగించారు. అనుమతులు లేకుండా ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లు ఏర్పాటు చేస్తే చర్యలు తీసుకుంటామని మున్సిపల్ అధికారులు తెలిపారు.

☞ చెట్టు తొలగించిన వ్యక్తికి రూ.2 వేల జరిమానా..
నగరంలోని ముస్తఫానగర్‌లో చెట్టు నరికి హలీం సెంటర్‌ను ఏర్పాటు చేసిన వ్యక్తికి కేఎంసీ అధికారులు రూ.2 వేల జరిమానా విధించారు. చెట్లను నరికితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని కేఎంసీ శానిటరీ సూపర్‌వైజర్ సాంబయ్య అన్నారు.

మైనార్టీలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం



సంచికను ఆవిష్కరిస్తున్న మంత్రి తుమ్మల

ఖమ్మం మామిళ్లగూడెం: మైనార్టీలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లప్పుడు అండగా ఉంటుందని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. సోమవారం గీటురాయి వారపత్రిక ముద్రించిన రంజాన్ ప్రత్యేక సంచికను నగరంలోని జమాతే ఇస్లామీ హింద్ సంఘ కార్యాలయంలో ఆవిష్కరించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. రంజాన్ పండగ మతసామరస్యానికి, సోదర భావానికి ప్రతీక అని, రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. జమాతే ఇస్లామీ హింద్ రాష్ట్ర సలహా మండలి సభ్యులు సాధిక్ అహ్మద్, రాష్ట్ర మాజీ కార్యదర్శి ముహమ్మద్ ఇల్యాస్, జిల్లా అధ్యక్షులు జైనుల్ పాషా, నాగరిక వికాస్ కేంద్రం మేనేజింగ్ కమిటీ అధ్యక్షులు అబ్దుల్ ముజీబ్ రమజాన్ ప్రత్యేక సంచిక గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు అబ్దుల్ సమి, ఖిల్లా, ఇంద్రనగర్, ఇస్లాంపేట అధ్యక్షులు అబ్దుల్ మలిక్, నిజాముద్దీన్, అబ్దుల్ సుబూర్, సభ్యులు, ఫయాజ్, ఇంతియాజ్, షేక్ ఇలియాస్, జిల్లా అధ్యక్షులు ఖాసీం తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి

ఖమ్మంరూరల్: అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని సీపీఎం పాలేరు డివిజన్ కమిటీ సభ్యుడు పి.మోహన్‌రావు తెలిపారు. సోమవారం ఈమేరకు మండలంలోని ఆరెంపుల గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట సీపీఎం ఆధ్వర్యాన ధర్నా నిర్వహించారు. ఆరు గ్యారంటీల్లో భాగంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఆరెంపుల గ్రామాన్ని ఎంపిక చేసినప్పటికీ అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందడం లేదన్నారు. ఏదో ఒక సాకు చెబుతూ లబ్ధిదారులకు మోసం చేస్తున్నారన్నారు. అనంతరం పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సీతారాంరెడ్డి, తిరపయ్య, అనిల్, వెంకటేశ్వర్లు, రామయ్య పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి స్వాధీనం


బోర్డు ఏర్పాటు చేస్తున్న అధికారులు

ఖమ్మంరూరల్: మండలంలోని ఏదులాపురం పరిధి టీఎన్‌జీఓస్ కాలనీలోని సర్వే నంబర్ 87లో ఐదెకరాల ప్రభుత్వ భూమిని సోమవారం రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఖమ్మం మహబూబాబాద్ ప్రధాన రహదారికి పక్కనే గల ప్రభుత్వ సీలింగ్ భూమిని కొందరు ఆక్రమించుకోగా 2004లో అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అప్పటి తహసీల్దార్ సీలింగ్ పట్టాలను రద్దు చేసి ప్రొసీడింగ్స్ ఇచ్చినా మరలా ఆక్రమణలకు గురవుతుండడంతో తహసీల్దార్ పి.రాంప్రసాద్, ఆర్ఐ ప్రసాద్ స్వాధీనం చేసుకుని బోర్డు ఏర్పాటు చేశారు. దీని విలువ రూ.10 కోట్ల వరకు ఉంటుందన్నారు. ప్రభుత్వ భూములను ఎవరు ఆక్రమించినా కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హెచ్చరించారు.

పోస్టు కార్డు ఉద్యమం

ఖమ్మం మామిళ్లగూడెం: గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యాన సోమవారం పోస్టు కార్డు ఉద్యమం చేపట్టారు. ఈమేరకు మయూరిసెంటర్ అమరవీరుల స్తూపం వద్ద సీఎం రేవంత్ రెడ్డికి హామీలు అమలు చేయాలని రాసి పోస్టుబాక్సులో వేశారు. తెలంగాణ ఉద్యమకారుల ఫోరం బాధ్యులు కేవీ కృష్ణారావు, పసుపులేటి నాసరయ్య, ఉద్యమకారులు వీరభద్రం, విజయ్‌కుమార్, రవిచంద్ర చౌహాన్, షేక్ నాగుల్‌మీరా, షేక్ అబ్బాస్‌అలీ, బురాన్, ఆసిఫ్, శ్రీనివాస్‌నాయక్, బాలిని భాస్కర రెడ్డి, విజయ్, రాజేందర్, నాగేశ్వరావు, రాము, సోమరాజు, వరలక్ష్మి, ధనలక్ష్మి, అనంతలక్ష్మి, స్వరూప, జయ తదితరులు పాల్గొన్నారు.

పేదల స్థలాల జోలికి రావొద్దు

ఖమ్మంమయూరిసెంటర్: పేదలకు ఇచ్చిన ఇళ్ల స్థలాలు బై బ్యాక్ పేరుతో వెనక్కి తీసుకునేందుకు ప్రయత్నిస్తే ఊరుకునేది లేదని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు అన్నారు. సోమవారం రఘునాథపాలెం మండలంలోని శివాయిగూడెం కొత్త కాలనీ సమస్యలు పరిష్కరించాలని, 900 మంది పేదలకు ఇచ్చిన ఇళ్ల స్థలాల బై బ్యాక్‌కు వ్యతిరేకంగా సీపీఎం ఖమ్మం డివిజన్ కమిటీ ఆధ్వర్యాన కలెక్టరేట్ ముట్టడి చేపట్టారు. ధర్నా చౌక్ నుంచి ప్రదర్శనగా బయలుదేరిన బాధితులు, సీపీఎం నాయకులు కలెక్టరేట్‌లోకి వెళ్లేందుకు ప్రయత్నించగా.. పోలీసులు అడ్డుకోవడంతో కొద్దిసేపు తోపులాట జరిగింది. ఈ సందర్భంగా నున్నా మాట్లాడుతూ.. కాలనీలో పేదల ఇళ్ల స్థలాల బై బ్యాక్ ప్రక్రియను వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. కాలనీలో కరెంటు, నీటి సౌకర్యం కల్పించాలని, ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు శ్రీకాంత్, ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై.విక్రమ్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు యర్రా శ్రీనివాసరావు, జిల్లా కమిటీ సభ్యులు ఎస్.నవీన్‌రెడ్డి, ఎం.ఏ.జబ్బార్, షేక్ మీరా సాహెబ్, శ్రీనివాస్, షేక్ నాగుల్ మీరా, షేక్ సైదులు పాల్గొన్నారు.

తప్పుడు ఆరోపణలు సరికాదు


సమావేశంలో మాట్లాడుతున్న ముస్తఫా

ఖమ్మంవన్‌టౌన్: బీఆర్ఎస్ నాయకులు చేసిన కబ్జాలు, అక్రమ నిర్మాణాలను కప్పిపుచ్చుకునేందుకే తనపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని కాంగ్రెస్ నాయకుడు మహ్మద్ ముస్తఫా ఆరోపించారు. సోమవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో బీఆర్ఎస్ నాయకుడు రామాలయం భూమిని కబ్జా చేశారని, తాను నగరంలో ఎక్కడైనా సెంట్ భూమి కబ్జా చేసినట్లు నిరూపిస్తే దేనికైనా సిద్ధమన్నారు. అనంతరం 53వ డివిజన్‌వాసులు రేణుకా, పట్టారాణి, మరియమ్మ, శిరీష మాట్లాడుతూ.. తమ పట్టాలు తమకే ఉన్నాయని, ఎవరూ కబ్జా చేయలేదన్నారు. ఈ సమావేశంలో నాయకుడు మిక్కిలినేని నరేందర్, కొప్పెర ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఆధారాలు లేకుండా మాట్లాడితే సహించం..


సమావేశంలో మాట్లాడుతున్న నాగరాజు

ఖమ్మంమయూరిసెంటర్: ఆధారాలు లేకుండా నోటికి వచ్చినట్లు మాట్లాడితే సహించబోమని, భూ కబ్జా చేసిన వారి వివరాలు, ఆధారాలు తన వద్ద ఉన్నాయని, వాటిని మంత్రి వద్ద ఉంచి ఫిర్యాదు చేస్తామని బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు అన్నారు. సోమవారం ఖమ్మంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కమ్యూనిటీ హాల్ కోసం 6 కుంటలు, స్కూల్ కోసం కేటాయించిన 7 కుంటల భూమిని కబ్జా చేస్తున్నారన్నారు. తనపై ఆరోపణలు చేస్తున్న కాంగ్రెస్ నాయకుడు ఉద్యోగాలు ఇప్పిస్తామని నకిలీ పత్రాలు సృష్టిస్తూ జనాల వద్ద డబ్బులు తీసుకున్నారని ఆరోపించారు.

మెగా హెల్త్ క్యాంపు

కామేపల్లి: మండలంలోని కొత్తలింగాలలో ఓ ఫంక్షన్ హాల్‌లో ఫొటో, వీడియోగ్రఫీ అసోసియేషన్ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన మెగా హెల్త్ క్యాంపును సీఐ తిరుపతిరెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా హైదరాబాద్ యశోద ఆస్పత్రి వైద్యులు కామేపల్లి, కారేపల్లి, రఘునాథపాలెం, ఏన్కూర్ ఫొటోగ్రాఫర్లకు, వారి కుటుంబ సభ్యులకు ఉచితంగా వైద్య పరీక్షలు చేసి మందులు అందించారు. అనంతరం ఫొటోగ్రాఫర్లకు ఐడీ కార్డులు అందించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్కే హుస్సేన్, గౌరవ అధ్యక్షులు నాగరాజుదేవర, కన్నేగోండ్ల అశోక్, చావా సంపత్‌కుమార్, జిల్లా అధ్యక్షులు మారగాని వెంకట్, కోశాధికారి నీరుడు తిరుపతిరావు, మండలాధ్యక్షుడు లక్ష్మీనారాయణ తదితరుల పాల్గొన్నారు.

పోస్టర్లు ఆవిష్కరణ


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

ఖమ్మంఅర్బన్: ఆదివాసుల హక్కుల కోసం ఏజెన్సీ ప్రాంతాల్లో ప్రతిఘటన పోరాటాలు నిర్వహించిన నాయకుడు రాయల సుభాష్ చంద్రబోసు(రవన్న) వర్ధంతి పోస్టర్లను సోమవారం మండలంలోని రాంక్యాతండాలో సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ మండల కార్యదర్శి లక్ష్మణ్ ఆవిష్కరించారు. ఈ నెల 9న ఖమ్మంలోని రామ నరసయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహిస్తున్న సభలో అత్యధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కేలోత్ పాపారావు, ధరావత లక్ష్మణ్, వెంకన్న, గ్రామ కమిటీ కార్యదర్శి ధరావత్ శివలాల్, జి.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మహిళా దినోత్సవ పోస్టర్లు..


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, అదనపు కలెక్టర్ శ్రీజ, తదితరులు

ఖమ్మం సహకారనగర్: మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన రూపొందించిన మహిళా దినోత్సవ పోస్టర్లను జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, అదనపు కలెక్టర్ పి.శ్రీజలు కలెక్టర్ చాంబర్‌లో సోమవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కస్తాల సత్యనారాయణ, మోదుగు వేలాద్రి, మహిళా విభాగం అధ్యక్షురాలు జి.ఉషశ్రీ,, కార్యదర్శి పి.సుధారాణి, ట్రెజరర్ శేషు ప్రసాద్, హౌస్ బిల్డింగ్ సొసైటీ కార్యదర్శి పి.విజయ్‌కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీ సూరంపల్లి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

తిరుపతమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు

కామేపల్లి: మండలంలోని తాళ్లగూడెం గ్రామంలో శ్రీ గోపయ్య సమేత లక్ష్మీతిరుపతమ్మ తల్లి, అంకమ్మతల్లి దేవాలయ మూడవ వార్షికోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ పూజారి ప్రసాద్ ఆధ్వర్యాన ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ నెల 6న తిరుపతమ్మతల్లి కల్యాణం, మహా అన్నదానం నిర్వహించనున్నట్లు దేవస్థాన కమిటీ సభ్యులు తెలిపారు.

నిబంధనలు సవరించండి

ఖమ్మంలీగల్: 35 బీఎన్ఎస్ఎస్ నిబంధనలు సవరించాలని కోరుతూ బార్ అసోసియేషన్ న్యాయవాది తాళ్లూరి దిలీప్ సోమవారం హైదరాబాద్ సెక్రటేరియట్‌లో లా సెక్రటరీ రెండ్ల తిరుపతికి వినతిపత్రం అందజేశారు. పలు నాన్ బెయిలబుల్ కేసులలో నిందితులకు 35 బీఎన్ఎస్ఎస్ నోటీసులు ఇవ్వడం వల్ల బాధితులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఏడేళ్ల లోపు శిక్ష పడే కాగ్నిజబుల్, నాన్ బెయిలబుల్ నేరాల్లో తప్పనిసరిగా అరెస్టులు అవసరమని, లేనిపక్షంలో నేరాల సంఖ్య గణనీయంగా పెరిగే అవకాశం ఉంటుందని తెలిపారు.

భూమి అన్యాక్రాంతం కాకుండా కాపాడండి


ఖమ్మం మామిళ్లగూడెం: ఖమ్మం సీఎస్ఐ చర్చి సంఘ సభ్యులు క్రయం పొందిన భూమిని అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని సోమవారం కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా కందుల డేవిడ్, దొడ్డ అశోక్ (మాజీ కార్పొరేటర్), పిల్లి విజయపాల్, వీడీఐ జయరాజ్ తదితరులు మాట్లాడుతూ.. ఖమ్మం సెయింట్ మేరిస్ పాస్టరేట్, పాండురంగాపురం పాస్టరేట్, ఇందిరానగర్ పాస్టరేట్, ఎన్ఎస్పీ పాస్టరేట్, పార్శిబంధం పాస్టరేట్‌లలో సంఘ సభ్యులు దేవుణ్ణి ఆరాదిస్తున్నట్లు తెలిపారు. కాగా, ధంసలాపురం రెవెన్యూ కొత్తగూడెం గ్రామ పరిధిలో బిషప్ ప్రతిష్ఠించిన శిలాఫలకాన్ని తొలగించి కొంతమంది అక్రమంగా ఆవాసాలు ఏర్పరచుకున్నారని తెలిపారు. ఆ భూమిని కాపాడి తమ సంఘాలకు అప్పగించాలని కోరుతూ కలెక్టర్ కార్యాలయంలో వినతి ప్రతం అందజేశారు.

వ్యవసాయ కార్మికులకు సమగ్ర చట్టం తేవాలి

ఖమ్మంమయూరిసెంటర్: వ్యవసాయరంగంపై ఆధారపడి జీవించే వ్యవసాయ కార్మికులకు సమగ్ర రక్షణ చట్టాన్ని తేవాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ డిమాండ్ చేశారు. సోమవారం పగిడిపల్లి ఏసు అధ్యక్షతన స్థానిక గిరిప్రసాద్‌భవన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యాన ఈ నెల 16న జరిగే సదస్సును జయప్రదం చేయాలన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు దండు ఆదినారాయణ, పగిళ్ల వీరభద్రం, కాసిబోయిన అయోధ్య, కంపసాటి వెంకన్న, తలారి రమేష్, పి.రాంబాబు, రామ్మూర్తి, జానకి రామయ్య, ఎం.వీరబాబు, శ్రీదేవి, నాగేశ్వరరావు పాల్గొన్నారు.


☞ ప్రశ్నించేతత్వం అలవర్చుకోవాలి
ఖమ్మంరూరల్: సమాజంలోని అసమానతలపై యువత ప్రశ్నించేతత్వం అలవర్చుకోవాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ అన్నారు. మండలంలోని ఏదులాపురం పరిధి వరంగల్‌క్రాస్‌రోడ్‌లో జరిగిన ఏఐవైఎఫ్ సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం ఏఐవైఎఫ్ నూతన కమిటీని ఎనుకున్నారు. ఈ సమావేశంలో నాయకులు దండి రంగారావు, సిద్దినేని కర్ణకుమార్, చెరుకుపల్లి భాస్కర్, ఓరుగంటి శేషగిరిరావు, శ్రీనాథ్‌రెడ్డి, గణపారపు ఉపేందర్ తదతరులు పాల్గొన్నారు.

పాలేరు పాత కాల్వ పరిశీలన


పాలేరు పాత కాల్వ వద్ద అధికారుల బృందం

నేలకొండపల్లి: చివర ఆయకట్టు భూములకు నిరంతరం సాగు నీటిని సరఫరా చేయాలని రైతాంగం అధికారులను కోరారు. దీంతో మండలంలోని సుర్దేపల్లి, చెన్నారం గ్రామాల్లో పాలేరు పాత కాలువను మండలస్థాయి అధికారుల బృందం సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయకట్టు భూములను సందర్శించి రైతులతో మాట్లాడారు. ఆయకట్టు పంటలు ఎండిపోకుండా వారబందీ కాకుండా కనీసం మూడు రోజులకోసారి నీటిని అందించాలని కోరారు. తహసీల్దార్ జె.మానిక్‌రావ్, ఎంపీడీఓ ఎం.యర్రయ్య, ఏడీఏ బి.సరిత, ఏఓ ఎం.రాధ, ఇరిగేషన్ ఏఈలు నరేష్, మదీనా, ఏఈఓలు అవినాష్, దుర్గాభవాని, అరవింద్, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఆలస్యం మధుసూదన్‌రావు, రైతు ప్రతినిధి గరిడేపల్లి రామారావు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన మందిర వార్షికోత్సవం


స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

కామేపల్లి: కామేపల్లిలోని సద్గురు శ్రీ అవధూతేంద్ర సరస్వతి స్వామి స్మృతి మందిరంలో సోమవారం శ్రీ సీతారామచంద్రుల రుక్మిణి సహిత రాధాకృష్ణ స్వాముల కల్యాణ మహోత్సవాన్ని మంత్రోచ్ఛరణల మధ్య వేద పండితులు జరిపించారు. మందిర 30వ వార్షికోత్సవాల్లో భాగంగా ఏడు రోజుల పాటు హరేరామ సంకీర్తన సప్తహం జరగగా స్వామికి హారతితో ముగిసింది. ఈ కార్యక్రమంలో అర్చకులు బలగం భార్గవశర్మ, సాయి రామకృష్ణ, నరసింహశర్మ, దేవాలయ కమిటీ అధ్యక్షుడు గొట్టుపర్తి శివాజీ, మహంకాళి రామనరసింహగుప్తా, నెహ్రూ, వెంకటేశ్వర్లు, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.